ప్రజాశక్తి
సోమవారం 22 జనవరి 2024
5
పార్వతీపురం మన్యం

28న ఓట్ ఫర్ ఒపిఎస్ సభ : యుటిఎఫ్

కలెక్టరేట్ : ఈనెల 28న రాజమండ్రిలో జరుగుతున్న ఓట్ ఫర్ ఒపిఎస్‌ను జయప్రదం చేయాలని యుటిఎఫ్ పిలుపునిచ్చింది. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను తీసుకొస్తానని చెప్పిన సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఉద్యోగులను, ఉపాధ్యాయులను మోసగించా రన్నారు. ఒపిఎస్‌ను రాజకీయ ఎజెండాగా మార్చేందుకు వివిధ రాజకీయ పార్టీల అభిప్రాయాలు చెప్పేందుకు ఈ సభకు ఆహ్వానించామని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ ఈ సభకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు బయలుదేరాలని, ఈ పోరాటానికి ఉపాధ్యాయులు ఆర్థిక సహకారం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, కోశాధికారి కె.మురళి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి.మధు, జిల్లా కార్యదర్శులు జానకీరావు, ఎన్.శ్రీను, కె.కృష్ణారావు, గోవిందమ్మ, నాయకులు పాల్గొన్నారు.

మొండెంఖల్ కేంద్రంగా... రేషన్ బియ్యం అక్రమ రవాణా

పక్క రాష్ట్రానికి అమ్మకాలు ● రీసైక్లింగ్‌తో స్థానికంగా విక్రయాలు

రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడిన లారీ (ఫైల్)

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం యథేచ్ఛగా బ్లాక్ మార్కెటుకు తరలిపోతోంది. దళారులు నేరుగా లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి మిల్లర్లకు ఎగుమతి చేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం మండలంలో గిరిజన గ్రామాలకు ముఖ కేంద్రంగా ఉన్న మొండెంఖల్ కేంద్రానికి అడ్డాగా అన్ని వ్యాపారాలకు అనుకూలంగా అక్రమార్కులు సిండికేటై లావాదేవీలు చేస్తున్నట్లు సమాచారం. అలా కొనుగోలు చేసిన బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి తిరిగి బహిరంగ మార్కెట్లో రకరకాల బ్రాండ్ల పేరుతో విక్రయాలు గిరిజన ప్రజలకు మోసగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రేషన్ బియ్యం మాఫియాను నియంత్రించాల్సిన పౌరసరఫరాలు, విజిలెన్స్ శాఖ అధికారుల పర్యవేక్షణా లోపంతో అక్రమాలకు అడ్డుకట్ట పడడంలేదు. అంతేకాకుండా స్థానికంగా సేకరించిన బియ్యాన్ని పక్క రాష్ట్రమైన ఒడిశాలోని మిల్లులకు తరలించి అక్కడ రీ సైక్లింగ్ చేసి, తళతళలాడే తెల్లని తెలుపు వచ్చేలా పాలిష్ చేయిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో బియ్యాన్ని వాహనాలు మార్చి తరలిస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీనికి కారణం వారికి అందాల్సిన ముడుపులు అందుతుండడంతో రేషన్ బియ్యం మాఫియాను అరికట్టాల్సింది పోయి నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు వవహిస్తున్నరని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.16 చొప్పన కొనుగోలు

లబ్ధిదారుల నుంచి కేజీ రూ.16 చొప్పున కొనుగోలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇంటింటికీ రేషన్ వాహనాల నిర్వహకులు బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర తీసుకుని లబ్ధిదారులకు కోటా బియ్యాన్ని అందజేస్తున్నారు. ఇలా రేషన్ వచ్చే బియ్యంలో రీసేల్ అవుతుండగా 80 నుంచి 85 శాతం వరకు మాత్రమే పేదలు తీసుకుంటున్నారు. ఈ బియ్యాన్నే డీలర్లు,లబ్ధిదారుల నుంచి వ్యాపారులు, దళారులకు కిలో రూ.16 చొప్పున కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు సమాచారం. వీటిపై విజిలెన్స్, సివిల్ సప్లై తనిఖీలు నామమాత్రంగా ఉండడంవల్లే వీరి దందాకు అడ్డు అదుపు లేకుండా పోతుంది.

యథేచ్ఛగా బహిరంగ మార్కెట్లో విక్రయాలు

లబ్ధిదారులు నుంచి సేకరించిన బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి యథేచ్ఛగా తిరిగి బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్నారు. 50 శాతానికి పైగా పక్క రాష్ట్రానికి తరలిపోతున్నాయి. మరో 50 శాతం లోకల్ మార్కెట్లో వివిధ బ్రాండ్ల పేరుతో యథేచ్ఛగా విక్రయాలు జరుగుతున్నాయి. 25 కేజీల బస్తా రూ.1050 నుంచి రూ.1100 చొప్పున బియ్యం వ్యాపారులు తిరిగి విక్రయిస్తున్నారు. ప్రముఖ కంపెనీల బ్రాండ్ల పేరుతో సైతం రీసైక్లింగ్ బియ్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కాలంలో బియ్యం ధరలు 25 కేజీల బస్తాపై రూ.100 నుంచి రూ.150 వరకూ ధరలు పెరిగిన విషయం విధితమే. అత్యధికంగా మధ్య తరగతి గిరిజన ప్రజలు తక్కువ ధరకు వస్తున్నాయని పాలిష్ చేసిన బియ్యాన్ని కొనుగోలు చేసుకుని వినియోగిస్తున్నారు. ఈ దందాతో దళారులు, మిల్లర్లు పెద్ద ఎత్తున లాభాలు కూడబెట్టకుంటున్నప్పటికీ, మధ్య, దిగువ తరగతి గిరిజనులు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజా పంపిణీ బియ్యం అక్రమ వ్యాపారాన్ని కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమార్కులపై కఠిన చర్యలు

ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ బియ్యం కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరం. లబ్ధిదారులు కూడా దీనిపై అవగాహన ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాల పోషణకు అందజేస్తున్నాయి. దుర్వినియోగం చేయకూడదు. క్షేత్రస్థాయిలో పరిశీలన పెంచాం. రేషన్ బియ్యం కొనుగోలు చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తాం. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- ఎ. సాంబశివరావు,
సివిల్ సప్లై డిటి, కురుపాం

సోషలిజం నిర్మాత లెనిన్

పలుచోట్ల శత వర్ధంతి సభలు

పార్వతీపురంలో లెనిన్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రపంచంలో కార్మిక రాజ్యం, సోషలిజం నిర్మాత, మార్క్సిజాన్ని ఆచరణలో పెట్టిన మహా మేధావి లెనిన్ అని సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో లెనిన్ శత వర్ధంతి సభ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కులు, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసం వేతనం పెంచాలని రష్యాలో సోషల్ ఏర్పడిన తర్వాతే అనేక ప్రజారక్షణ హక్కులు చట్టాలు వచ్చాయని అన్నారు. దోపిడీదార్లు ఆ రాజ్యాన్ని కూల్చిన తర్వాత ఇప్పుడు మళ్లీ కార్మికులకు, ప్రజలకు కష్టాలు మొదలయ్యాయన్నారు. కావున లెనిన్ పోరాటస్ఫూర్తితో కార్మిక రాజ్యం కోసం అన్ని రంగాలు, సంఘాలు, పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.వెంకటరమణ, కె.రామస్వామి, మండంగి రమణ, రాము, సిఐటియు పలు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యాన...

పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగాఆర్థిక సమానత్వం సాధించడానికి సోషలిజం విప్లవానికి నాంది పలికిన వ్లాదిమిర్ లెనిన్ ఆశయాలను సాధించడానికి కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా ఆసుపత్రి వద్ద సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఇవి నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో లెనిన్ చిత్రపటానికి మన్మధరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మూలనకు లెనిన్ చేసిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కన్వీనర్ ఆర్.కుమార్, ఆసుపత్రి కార్మికుల జిల్లా అధ్యక్షులు అలజంగి కుమారమ్మ, ఎఐవైఫ్ జిల్లా అధ్యక్షులు కూరంగి గోపినాయుడు, చేతివృత్తుల సంఘం జిల్లా కార్యదర్శి సింహాద్రి దుర్గారావు, జిల్లా ఆసుపత్రి శానిటేషన్, సెక్యూరిటీ సూపర్ వైజర్లు మౌళి, సుధీర్, వంశీ, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రామిక జనానికి కాంతి రేఖ లెనిన్

సాలూరు: ప్రపంచ శ్రామిక జనానికి క్రాంతి రేఖ లెనిన్ అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వైనాయుడు చెప్పారు. లెనిన్ జయంతి సందర్భంగా ఆదివారం పట్టణ సిపిఎం కమిటీ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ బడుగు వర్గాల ఆశాజ్యోతి లెనిన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు శ్రీనివాసరావు, రాముడు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొండ : లెనిన్ శత వర్ధంతి సభ పాలకొండలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం తిరుపతిరావు సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలరమణారావు, నాయకులు కాద రాము, దూసి దుర్గారావు శ్రామిక మహిళలు ఆధ్వర్యాన జరిగింది. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ కష్టజీవులు, కార్మిక వర్గ ప్రజలు దోపిడీ వర్గాల నుంచి విముక్తి కావాలంటే ట్రేడ్ యూనియన్లు వర్గ చైతన్యంతో పాటు పెట్టుబడిదారీ రాజ్యాంగాన్ని ఎదుర్కోవాలంటే ఒక కేంద్రీకృత పార్టీ విప్లవ పార్టీ తప్పనిసరి అవసరమని అన్నారు. దీన్ని లెనిన్ కృషి చేసి ఆచరణలో రుజువు చేశారని, ఆయన మరణించి నేటికి వందేళ్లయిందని, ప్రపంచంలో నేటికీ ఆయన ఆశయాలు ఉన్నాయని అన్నారు. ఆయన ఆశయాలు ముందుకు తీసుకువెళ్లడం ద్వారా కార్మిక వర్గ ప్రజలకు విముక్తి కలుగుతుందని అన్నారు.

శంబర జాతరకు రారండోయ్

అంబ పండగకు అంతా సిద్ధం
నేడు తొలేళ్ల ఉత్సవం

ప్రజాశక్తి -మక్కువ

రాష్ట్ర గిరిజన జాతరగా గుర్తింపు పొందిన ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు దేవాదాయశాఖ సర్వం సిద్ధం చేసింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈసారి క్యూలైన్లో విశాలంగా ఏర్పాట్లు చేశారు. అలాగే ఉచిత ప్రసాదాలతో పాటు పది రూపాయలు, 15 రూపాయలకు అమ్మవారి ప్రసాదాలు లడ్డు పులిహారాలు కూడా విక్రయించ నున్నారు. మొత్తం 70 వేల లడ్డూలు సిద్ధం చేయాలని భావిస్తుండగా, ఇందులో భాగంగా 10వేల లడ్డూలను సిద్ధం చేశారు. ఈసారి లడ్డూ ప్రసాదాలకు ఎలాంటి కల్తీలకు ఆస్కారం లేకుండా తయారు చేసే తోటే యంత్రం ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ పర్యవేక్షణలో చదును గుడి, వనం గుడిలో వద్ద భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాట్లు చేశారు. గోముఖీ నదీ తీరంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు, కేశఖండన కోసం ఏర్పాటు చేసే పనులు పూర్తికావచ్చాయి. ప్రస్తుతం మరుగుదొడ్లతో పాటు తాత్కాలికంగా మహిళా భక్తుల కోసం ప్రత్యేక బాత్ రూమ్‌లు, స్నానపు గదులు ఏర్పాటు చేశారు.

నేడు తొలేళ్ల ఉత్సవం

పోలమాంబ అమ్మవారి జాతరలో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవం జరగనుంది. ఈ సందర్భంగా అమ్మవారి ఘట్టాలకు పసుపు, కుంకుమలు పూసి ఊరంతా కలియ తిరుగుతారు. అనంతరం గ్రామస్తులంతా ధాన్యం గద్దెకు చేర్చి ఉపవాసం చేసిన యువకులు, వృద్ధులు పెళ్లికుమారుల వలే తయారై ధాన్యాన్ని తొలేళ్లుగా తొక్కుతారు. అనంతరం ఎవరు తెచ్చిన ధాన్యం వారు తీసుకుపోయి, వాటిని విత్తనాలుగా జల్లుకోవడం ఆనవాయిది. అంతరం రాత్రి అమ్మవారి ఘట్టాలను తలపై మూసుకుంటూ మొక్కులు తీర్చుకుంటారు.

జాతరలో ఈ ఏడాది..

పోలమాంబ జాతర సందర్భంగా ఈ ఏడాది కొన్ని ప్రత్యేకతలు సంతరించుకున్నాయి. అమ్మవారి ఫ్లెక్సీలను ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేశారు. అలాగే సుమారు రూ.48వేల ఖర్చుతో టచ్ స్క్రీన్ ల్యాప్‌టాప్‌లతో టికెట్లు భక్తులకు ఇవ్వనున్నారు. ఈ ఏడాది అమ్మవారి దర్శనం టిక్కెట్లు రేట్లు 100శాతం పెంచారు. గతంలో పది రూపాయలు, 50 రూపాయలు ఉండే టిక్కెట్లు ధరలను ఈ ఏడాది రూ.20, రూ.100గా మార్చారు. అలాగే పోలమాంబ ఆలయం వద్ద బోర్డులను ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సోమవారం రోషన్ లాల్ ఆర్కెస్ట్రాను ఏర్పాటుచేసి భక్తులను ఉత్తేజపర్చనున్నారు.

భారం అంతా ఆయన పైనే..

ఈ ఏడాది జాతర భారమంతా ఆలయ కార్యనిర్వాహణాధికారి వివి సూర్యనారాయణ పైనే పడనుంది. ఎందుకంటే ట్రస్ట్ బోర్డు గానీ, ఉత్సవ కమిటీ కానీ ఈ ఏడాది జాతరలో ఏర్పాటు చేయకపోవడమే కారణం. చాలావరకు జాతర ఏర్పాట్లన్నీ ఇఒ పర్యవేక్షించాల్సి ఉంది. అంతేకాకుండా గ్రామంలో తలెత్తే రాజకీయ ప్రభావాలు కూడా ఇఒకు ఒకంత తలనొప్పిగా మారాయని చెప్పక తప్పదు. ఆలయ అధికారిగా కొత్తగా రావడం, ఇక్కడి పరిస్థితులు అవగాహన చేసుకునేందుకు పెద్దగా సమయం లేకపోవడంతో నొప్పించక తానవ్వక అన్న చందంగా ఇఒ వ్యవహరించాల్సి వస్తుందన్నది పలువురు చర్చించుకుంటున్నారు.

గ్రామానికి చేరుకున్న సినిమాను

మంగళవారం సినిమానోత్సవానికి సిద్ధం చేయాల్సిన కర్రను ఆదివారం ఏడు జతల పశువుల సాయంతో గ్రామానికి తీసుకొచ్చారు. గుండం కొండ వద్ద గుర్తించిన సినిమాను తీసుకువచ్చారు. సోమవారం సావిడి వీధిలో సిరిమానును రథంపైకి తయారు చేయనున్నారు.

చదును గుడి వద్ద యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన టెంట్లు

సిద్ధంగా ఉన్న లడ్డూ ప్రసాదం

సాలూరులో ఆకులు తింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

విజయనగరం పోలీసు స్టేషన్‌లో అరెస్టయిన అంగన్వాడీలు

ఆకులు తింటూ అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి -సాలూరు

అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె ఆదివారానికి 41రోజుకు చేరింది. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన చేపడుతున్న సమ్మెలో భాగంగా ఆకులు తింటూ అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎ.నారాయణమ్మ, శశికళ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు మాట్లాడుతూ ఎస్మా చట్టం తొలగింపు ఉత్తర్వులు జారీ చేస్తామని ఐసిడిఎస్ అధికారులతో బెదిరింపులకు దిగడం మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గౌరీశ్వరి, ఇందిరా కుమారి, జానకి సుభద్ర, పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కళ్లు మూసుకుంటూ...

పాలకొండ : స్థానిక తహశీల్దార్ కార్యాల యం వద్ద అంగన్‌వాడీలు తలపెట్టిన నిరసనలో భాగంగా కళ్లు మూసు కుంటూ జగనన్న చూడాలంటూ ఆందోళన చేపట్టారు. 41వ రోజు సమ్మెలో భాగంగా పాలకొండ ప్రాజెక్ట్ కేంద్రంలో కళ్లు మూసుకుంటూ అంగన్వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమప్రభ, జిల్లా కోశాధికారి బి.అమరవేణి మాట్లాడుతూ 41 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని, అందుకే ఆకుల తింటూ నిరసన తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, మండల కార్యదర్శి కాద రాము, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దూసి దుర్గారావు, గిరిజనసంఘం నాయకులు ఎం.తిరుపతిరావు, అంగన్‌వాడీ నాయకులు జి.జెస్సీబాయి, గంగమ్మ, కుమారి, భవాని, అచ్చమ్మ, మణి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల తొలగింపు

పార్వతీపురంరూరల్ : విధులకు హాజరు అంగన్‌వాడీ కార్యకర్తలను, ఆయాలను తొలగిస్తున్నట్టు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే అనేక రోజులుగా వేచిచూశామన్నారు. సోమవారం తొలగింపు ఉత్తర్వులు జారీ చేయనున్నట్టు తెలిపారు. నోటిఫికేషన్ విడుదల చేసి కొత్త నియామకాలు చేపట్టనున్నట్టు తెలిపారు. జిల్లాలో విధులకు హాజరు కాని కార్యకర్తలు 1444 మంది, ఆయాలు 931 మంది ఉన్నారు. నియామకాలకు ఈనెల 25న కొత్త నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు పేర్కొన్నారు.

విజయనగరం రైల్వే స్టేషన్‌లో 19 మంది అరెస్టు

ప్రజాశక్తి - విజయనగరం

చలో విజయవాడ వెళ్లేందుకు బయలుదేరిన అంగన్‌వాడీలను విజయనగరంలో విజయవాడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు బయలుదేరే ముందు స్థానిక వన్ టౌన్ పోలీస్‌లు వచ్చి అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, కొమరాడ మండల అంగన్వాడీ సెక్టార్ నాయకులు జ్యోతి, పుష్ప, భారతితో 19 మంది ఉన్నారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ 41 రోజులుగా అంగన్వాడీ సిబ్బంది సమ్మెలో ఉన్నప్పటికీ కూడా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని అన్నారు. సమస్యలపై ఇప్పటికే మంత్రులకు, ఎమ్మెల్యేలకు, కలెక్టర్‌కు అందరికీ తెలియజేసినా ఏ మాత్రం కూడా పట్టించుకోకపోవడం చాలా అన్యాయమని అన్నారు. కావున ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి తమ సమస్యలు చెప్పుకోవడానికి విజయవాడ వెళ్తున్న సందర్భంలో రైల్వే స్టేషన్‌లో పోలీసు అక్రమంగా అరెస్ట్ చేయడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా అక్రమంగా అరెస్టు చేసి ఉద్యమాలు ఆపలేరని, కావున ఇప్పటికైనా పోలీసులు అక్రమ అరెస్టులు ఆపి తమ సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రత చేస్తామని నాయకులు అన్నారు.

నాయకుల ఇళ్ల వద్ద పహారా

చలో విజయవాడ కార్యక్రమానికి నాయకులు, అంగన్‌వాడీలు ఎవరూ వెళ్లకుండా పోలీసులు వారి ఇళ్ల వద్ద పహారా కాశారు. ఇందులో భాగంగా పార్వతీపురం పట్టణంలో సెక్టార్ నాయకులు కె.రాజేశ్వరిని పోలీసులు గృహనిర్బంధం చేశారు.

పిల్ల కొంచెం.. కూత ఘనం..

ఇండియా బుక్ ఆఫ్ రికార్డుకు ఎంపికైన పార్వతీపురం చిన్నారి



ఇండియా బుక్ ఆఫ్ రికార్డుకు ఎంపికైన దుర్శిత్‌రామన్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పట్టణంలోని జనశక్తి కాలనీకి చెందిన పెద్దింటి వెంకటరమణ, హైమాల రెండేళ్ల కుమార్తె దుర్షిత రామన్. ఈ చిన్నారి తన జ్ఞాపక శక్తితో అనర్గళమైన ప్రతిభ కనబరిచి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది. బుడిబుడి నడకలు నడుస్తూ ముద్దు ముద్దు మాటలు పలికే దుర్చిత రామన్ ఈ వయసులోనే 40 దేశాల పేర్లు, రాష్ట్ర రాజధానులు, సౌర గ్రహాలు, రంగులు పేర్లు, ఆంగ్ల అక్షరమాలలు, 1 నుంచి 25 వరకు సంఖ్యలు, శరీర భాగాలు పేర్లు, ఆల్ఫాబెట్ అన్ని చిత్రాలు, కూరగాయల పేర్లు, 32 పండ్ల పేర్లు, ఎక్కాలు, జాతీయ చిహ్నాలు, మ్యాప్‌లో దేశ పేర్లు, జంతువుల శబ్దాలు, భారత జెండా రంగులు, ప్రధాని, సిఎం, దేశం, రాష్ట్రం పేర్లను అలవోకగా చెబుతూ అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఆమెలోని ప్రతిభను గుర్తించిన తల్లితండ్రులు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారిని సంప్రదించారు. ఈ మేరకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు చిన్నారిలోని ప్రతిభాపాటవాలను పరీక్షించి తమ పుస్తకంలో చోటు కల్పించారు. రెండేళ్ల ఐదు నెలల ప్రాయంలోనే తమ చిన్నారికి ఇంతటి జ్ఞాపక శక్తి రావడం తమకు ఆశ్చర్యంగా ఉందని, మున్ముముందు ఆమెను తమకు గల అవకాశాలతో చదివించి ఆమెకు ప్రోత్సాహం కల్పించాలని అనుకుంటున్నామని తెలిపారు. అందుకు సంబంధించిన సంస్థల సహకారాన్ని కోరుకుంటున్నామని తెలిపారు.

టిడిపి భూస్థాపితమే సిఎం లక్ష్యం

భీమిలి సభకు వేలాదిగా తరలిరావాలి
సన్నాహక సమావేశంలో డిప్యూటీ సిఎం

సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో టిడిపి భూస్థాపితమే సిఎం జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. ఈనెల 27న భీమిలిలో నిర్వహించనున్న ఉత్తరాంధ్ర జిల్లాల నాయకులు కార్యకర్తల సమావేశానికి సిఎం జగన్ హాజరు కానున్న నేపథ్యంలో సభ విజయవంతం కోసం పట్టణంలోని శ్రీ సీతారామ కళ్యాణమండపంలో నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ళు రాష్ట్రాన్ని పాలించిన టిడిపి భూతాన్ని తరిమి కొట్టేందుకు సిఎం జగన్ మహాయజ్ఞం తలపెట్టారని చెప్పారు. దానిలో భాగంగానే వైసిపి ప్రభుత్వం తొలివిడత పాలనలో సిఎం జగన్ మోహన్ రెడ్డి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. మరో రెండు నెలల్లో జరగనున్న ఎన్నికల్లో ఓపిక, సహనంతో పని చేస్తే తర్వాత వచ్చే ఐదేళ్లు పార్టీ శ్రేణులకు స్వర్ణయుగం లా వుంటుందని చెప్పారు. కల్లబొల్లి కబుర్లు చెప్పి కాలయాపన చేయడం తనకు ఇష్టం లేదన్నారు. ఈ విధానం కొంతమందికి నచ్చకపోయి ఉండొచ్చునని చెప్పారు. ఇటీవల అరుకు పర్యటనలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు డోలీ మోతల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 14ఏళ్ళు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు ఎందుకు గిరిశిఖర గ్రామాలకు రోడ్లు నిర్మించలేదని ప్రశ్నించారు.భీమిలిలో జరుగనున్న సిఎం జగన్ మోహన్ రెడ్డి ఉత్తరాంధ్ర సభకు వేలాది మంది తరలిరావాలని రాజన్నదొర కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్,పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, వైస్ ఎంపిపిలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, పాచిపెంట ఎంపిపి బి.ప్రమీల, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, డి.బాబ్జీ,జెడ్పీ వైస్ చైర్మన్ కె.సింహాచలం, మక్కువ మండల అధ్యక్షులు మావుడి రంగు నాయుడు, మెంటాడ మండలం నాయకులు ఈశ్వరరావు పాల్గొన్నారు .

జర్జాపు సోదరులు డుమ్మా:

సిఎం జగన్ మోహన్‌రెడ్డి హాజరు కానున్న భీమిలి సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం పట్టణంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి పట్టణ వైసిపి ముఖ్య నాయకులు గైర్హాజరయ్యారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు సమావేశానికి హాజరు కాలేదు. వీరితో పాటు జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్ రాపాక మాధవరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ కూడా హాజరు కాలేదు. జర్జాపు సోదరులు డుమ్మా కొట్టడం వెనుక బలమైన కారణం వున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ చైర్‌పర్సన్ మార్పునకు సంబంధించి గతంలో జరిగిన పెద్ద మనుషుల ఒప్పందం అమలు చేయాలని జర్జాపు సూరిబాబు గత కొంతకాలంగా కోరుతున్నారు. పార్టీ జిల్లా పెద్దలు ఈ ఒప్పందం అమలు చేయడంలో తాత్సారం చేయడంతో వారు అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. గత కొంత కాలం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.

పశువుల అక్రమ రవాణాపై చర్యలేవీ?

యథేచ్ఛగా ఒడిశా నుంచి తరలింపు
ముడుపుల మత్తులో అధికారులు
చోద్యం చూస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ నడిబొడ్డు మీదుగా ప్రతివారం వందల కొద్దీ మూగజీవాల అక్రమ రవాణా జరుగుతోంది. విజయనగరం జిల్లాలోని మానాపురం సంతకు వారం వారం వందల సంఖ్యలో పశువుల తరలింపు గత అనేక ఏళ్లుగా సాగుతోంది. శనివారం జరిగే వారపు సంతకు ఒడిశా నుంచి వందల కొద్దీ మూగజీవాల రవాణా జరుగుతోంది. ఒడిశాలోని సిమిలిగూడ, కోరాపుట్ ప్రాంతాల నుంచి పశువుల వ్యాపారులు పట్టణం మీదుగా రవాణా చేస్తున్నారు. కొంతమంది భారీ కంటెయినర్ లారీల్లో తరలిస్తే మరికొంత మంది కాలినడకన మూగజీవాలను తరలిస్తున్నారు. సంతకు వెళ్తున్న ఈ పశువుల్ని అక్కడ నుంచి చెన్నయ్,కేరళ రాష్ట్రాలకు తరలిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ భాగోతం గత కొంతకాలంగా సాగుతున్నా జిల్లా యంత్రాంగం గానీ, పోలీస్ శాఖ గానీ చూసీచూడనట్టు వ్యవహరిస్తోంది.

బైపాస్ రోడ్డు మీదుగా రవాణా

ఒడిశా నుంచి వందల కొద్దీ మూగజీవాలను పట్టణంలోని బైపాస్ రోడ్డు మీదుగా తరలిస్తున్నారు. గతంలో పట్టణ నడిబొడ్డు మీదుగా వెళ్తున్న జాతీయ రహదారిపై నుంచే పశువుల రవాణా సాగుతుండేది. బైపాస్ రోడ్డు నిర్మాణమైన తర్వాత దాని మీదుగా తరలింపు జరుగుతోంది. మూగజీవాల సంరక్షణకు సంబంధించిన చట్టాలు ఎన్ని ఉన్నా వాటిని అమలు చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రతివారం పశువుల రవాణా వెనుక వ్యాపారుల మాఫియా వున్నట్లు తెలుస్తోంది.

పశువుల లారీ బోల్తా పై చర్యలేవీ?

కొద్ది రోజుల క్రితం ఒడిశా నుంచి కంటెయినర్ లారీలో పశువులను కుక్కేసి మానాపురం సంతకి తరలిస్తుండగా పట్టణ బైపాస్ రోడ్డులో ఆ లారీ బోల్తా పడింది. ఈ సంఘటనలో పది పశువులు అక్కడ కక్కడే మృత్యువాత పడ్డాయి. ఒడిశాలోని సిమిలిగుడ నుంచి మానాపురం సంతకు కంటెయినర్ లారీలో పశువులను తరలిస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ సంఘటన జరిగి 15రోజులు దాటిపోయింది. ఇంతవరకు అక్రమ రవాణా చేస్తున్న యజమానిపై చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నారని చెప్పారు. ఆ డ్రైవర్ దొరికాడా, అసలు సూత్రధారైన వ్యాపారిపై కేసు నమోదు చేశారా లేదా అనేది తెలియడం లేదు. చిన్న నేరాలకు సంబంధించి విచారణ జరిపి నిందితులను పోలీసులు పట్టుకుని మీడియా ముందు ప్రవేశపెడతారు. ఇంత తీవ్రమైన నేరానికి సంబంధించిన కేసులో పోలీసులు ఏం పురోగతి సాధించారనేది బయటకు రాలేదు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పశువులు (ఫైల్)

నెలవారీ ముడుపులు?

ఒడిశా నుంచి వందల కొద్దీ మూగజీవాలను ప్రతివారం అక్రమ రవాణా చేస్తుండడం వెనుక వ్యాపారుల మాఫియా లాబీయింగ్ వున్నట్లు తెలుస్తోంది. అందుకే కేసు విచారణ అంశాలను వెలుగులోకి రావడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.అంతర్రాష్ట్ర పశువుల మాఫియా నెలనెలా ముడుపులు అందజేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

గోసంరక్షణ సంస్థలేం చేస్తున్నాయి?

ప్రతి నెలా వేల సంఖ్యలో పశువుల ను అక్రమ రవాణా చేస్తుంటే గోసంరక్షణ సంస్థ లు ఏం చేస్తున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గోవుల రక్షణపై తమదే పేటెంట్ హక్కని వాదించే బిజెపి అనుబంధ సంస్థలు ఎందుకు కిమ్మనడం లేదనే పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ బాగోతాన్ని నడిపిస్తున్న మాఫియాతో ఆ సంస్థలు కుమ్మక్కవుతున్నాయనే ప్రచారం జరుగుతోంది.

చీరలు పంపిణీ చేస్తున్న అప్పడుస్వామి

నిరుపేద మహిళలకు చీరలు వితరణ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో ఆదివారం నిరుపేద మహిళలకు నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు సమక్షంలో ఆ గ్రామానికి చెందిన జమ్మల నారాయణ మ్మ మూడో వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు జమ్మల అప్పడు (పంతులుస్వామి) 25 మంది నిరుపేద మహిళలకు చీరలు, పండ్లు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ అప్పడు స్వామి ప్రతిఏటా తన తల్లి జ్ఞాపకార్థం తన శక్తి మేరకు 25మందికి పండ్లు, బట్టలు అందజేస్తున్నారన్నారు. ఈ మేరకు స్వామి కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో గొర్రెల శ్రావణ్ కుమార్, నేరల్ల శంకరస్వామి, చోడి అప్పడు, నేరల్లా జగదీశ్వరరావు, బంగారి, కన్న శెట్టి, డాక్టర్ శ్రీను, గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలైన బాలేరు-1 జట్టు సభ్యులు

కబడ్డీ విజేత బాలేరు-1 జట్టు

ప్రజాశక్తి - భామిని

ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా కబడ్డీ విభాగంలో బాలేరు- 1 జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విజేతగా నిలిచింది. ఈ మేరకు బాలేరు ఎంపిటిసి సభ్యులు కొత్తకోట చంద్రశేఖర్ అభినందనలు తెలుపుతూ నియోజకవర్గస్థాయిలో కూడా విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మెడిబోయిన చలపతిరావు, సర్పంచ్ జామి ప్రభాకర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కళావతిని సత్కరిస్తున్న బిషప్, ఫాదర్లు

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని యు.వెంకంపేట పంచాయతీ పరిధి గిరి పుణ్యక్షేత్రంలో మరియగిరి మహోత్సవంలో భాగంగా ఆదివారం నవదిన కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే వి.కళావతికి శ్రీకాకుళం బిషప్ రాయరాల విజయకుమార్, తదితర ఫాదర్లు గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చిదిమి, యు.వెంకంపేట సర్పంచులు డి.ఉమామహేశ్వరరావు, ఎస్ లక్ష్మి- సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

పెదంకలాంలో 'మన సీతానగరం - మన జనసేన'

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదంకలాంలో సీతానగరం జనసేన బృందం ఆధ్వర్యాన మన సీతానగరం-మనజనసేన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి జనసేన కరపత్రాలు పంచి పార్టీ సిద్ధాంతాలను వివరించారు. ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఐటి కోఆర్డినేటర్ పైల సత్యనారాయణ మాట్లాడుతూ రాబోయేది జనసేన-టిడిపి ప్రభుత్వమేనని, ప్రస్తుత ప్రభుత్వ పరిపాలనలో కార్మిక, కర్షక, బడుగు, బలహీనవర్గాలు విసిగిపోయి ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అక్కివరపు మోహనరావు, అల్లు రమేష్, కె.సత్యనారాయణ, జైశంకర్, సాయికిరణ్, గణేష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పార్కుకు జనకళ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీయార్ అడ్వంచర్ పార్క్ ఆదివారం పర్యాటకులతో పోటెత్తింది. సంక్రాంతికి వచ్చిన విద్యార్థులు, స్నేహితులు, బంధువులు సోమవారం పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో ఆదివారం తల్లిదండ్రులు పిల్లలతో సరదాగా గడపడానికి పార్కు తరలివచ్చారు. పార్క్‌లోని అందాలను ఆశ్వాదించారు. పార్కులో చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందర్నీ ఆకట్టుకునే ఈవెంట్స్ ఉన్నాయి. పార్కులో జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జ్ నీటి మీద నడక యువతీ యువకులు నడిచారు. ఆకాశంలో స్కై సైకిల్ ఎక్కి సైక్లింగ్ చేశారు. చిన్నపిల్లలు మినీ బోటింగ్ చేశారు. యువతీ యువకులు ఆనంద విహార వద్ద బోటు షికారు చేసి ఉల్లాసంగా, ఉత్సాహంగా డాన్సులు వేశారు. మరికొంతమంది పర్యాటకలు గన్ షాట్ షూటింగ్ చేశారు. అనంతరం మెట్టగూడ జలపాతాన్ని సందర్శించారు.

సూర్యపీఠంలో రామాయణ మన్త్ర హోమాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ శివారున గల సూర్య పీఠంలో ఆదివారం రామాయణ మన్త్ర హెూమాలు వేమకోటి నరహరి శాస్త్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేమకోటి వివేకాంద్, కేశవశర్మ, టిఆర్ కృష్ణశర్మ, వైదిక సహకారం అందించారు.

రూ. 1100 కోట్లతో అభివృద్ధి పనులు

డిప్యూటీ సిఎం రాజన్న దొర

ప్రజాశక్తి - పాచిపెంట

సాలూరు నియోజకవర్గంలో రూ.1100 కోట్లు అభివృద్ధి పనులు పూర్తి చేశామని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర తెలిపారు. మండలంలో మాతమూరు నుండి కాపు తాడూరు వరకు వెళ్లే రహదారిలో రూ.9.80 కోట్లు, మోసురు గ్రామానికి వెళ్లే రహదారిలో రూ.7.60 కోట్లుతో నిర్మించిన వంతెనలను ఆదివారం ఆయన ప్రారంభించారు.అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ ఈ వంతెనల నిర్మాణాలతో మారుమూల గ్రామాల ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందన్నారు. దీర్ఘకాలంగా ఎదురు చూసిన రహదారులు వచ్చాయని, అయితే వంతెనలు లేకపోవడం వల్ల దూర ప్రాంతాల ప్రజలు కొంత ఇబ్బందులకు గురయ్యారు. వంతెనల నిర్మాణాలతో ఈ ఇబ్బందులు తొలగాయన్నారు. మారుమూల ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కృషి చేస్తున్నామని తెలిపారు. గిరిజనులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ప్రగతి పథకంలో నడవాలని పిలుపునిచ్చారు.



వంతెన పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

కార్యక్రమంలో పంచాయతీరాజ్ జిల్లా ఇంజినీర్ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, ఎంపిపి బి.ప్రమీల, జెడ్‌పి వైస్‌చైర్మన్ కె.సింహాచలం, వైసిపి మండల అధ్యక్షులు గొట్టాపు ముత్యాలునాయుడు, వైస్ ఎంపిపి రవీంద్రబాబు, నాయకులు గండిపల్లి చంటి, డోల బాబ్జీ, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన మోసూరు గ్రామస్తుల చిరకాల కోరిక

మాట నిలబెట్టుకున్న డిప్యూటీ సీఎం పి రాజన్న దొర మేల వాయిద్యాల నడుమ పల్లకిలో ఊరేగించిన మోసూరు గ్రామస్తులు వంతెన నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేసిన డిప్యూటీ సీఎం పి రాజన్న దొరకు మోసూరు మాతుమూరు తాడూరు ఆ పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు కతజ్ఞతలు తెలిపారు

పోడు పట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

అటవీ హక్కులు చట్టాన్ని సక్రమంగా అమలు చేసి గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పూర్తిస్థాయిలో అటవీ పోడు పట్టాలు మంజూరు చేయాలని, కొండలపై హక్కు కల్పించాలని గిరిజన సంఘం నాయకులు సొయ్యారి సోమన్న, తామల సింహాచలం, కొర్ర శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావుతో కలిసి మండలంలోని ఒడిసెలమాడ, రిట్టలపాడు, పెదమడలు గ్రామాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ 2005లో వచ్చిన అటవీ హక్కుల చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని, సాగు చేస్తున్న పూర్తి స్థాయిలో గిరిజనులకు పట్టాలు ఇవ్వడం లేదని అన్నారు. దీని కారణంగా గిరిజనులకు అటవీ భూములపై హక్కులు ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ హక్కు చట్టం ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికి పదెకరాలు చొప్పున సాగులో ఉన్నంత వరకు పట్టాలు ఇవ్వొచ్చని చట్టంలో ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గిరిజనులకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అటవీ హక్కుల చట్టాన్ని సక్రమంగా అమలు చేసి మండలంలో పూర్తిగా గిరిజన ప్రాంతాల్లో చట్టాన్ని సక్రమంగా అమలు చేసి గిరిజనులను ఆదుకోవాలని కోరారు. అలాగే అటవీశాఖ అధికారుల వేధింపుల నుంచి గిరిజనులకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని అన్నారు.

పోడు పట్టాలు మంజూరు చేయాలని ఆందోళన చేస్తున్న గిరిజనులు

ఎన్‌వైకె ఆధ్వర్యంలో రహదారి భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

పార్వతీపురంలో ఆదివారం నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ పైడాన శ్రీను ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు, ట్రాఫిక్ నియంత్రణ సిబ్బందితో కలిసి రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి వాహన చోదకులకు రహదారి ప్రమాదాలపై తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దఎత్తున యువత పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ఎపై పాపారావు

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - సాలూరు

యువకులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని టౌన్ సిఐ జిడి బాబు కోరారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని మజ్జులపేటలో యువకులతో మాట్లాడుతూ సారా, గంజాయి తయారీ, విక్రయాలు, రవాణా చేయడం వంటి కార్యక్రమాలకు దూరంగా వుండాలని సూచించారు. అలాంటి కేసుల్లో ఇరుక్కుంటే బంగారు భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. తల్లిదండ్రులకు తీరని అవమానం తెచ్చిన బిడ్డలుగా మిగిలి పోతారని హితవు పలికారు. జూదం, బెట్టింగ్, ర్యాగింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనవద్దని సిఐ జిడి బాబు కోరారు.

మజ్జులపేటలో యువకులతో మాట్లాడుతున్న సిఐ జిడి బాబు

బాబోయ్ రైలు ప్రయాణం

ప్రజాశక్తి-బొబ్బిలి

రైలు ప్రయాణమంటే జనం బెంబేలెత్తిపోతున్నారు. గుంటూరు, సమత ఎక్స్‌ప్రెస్ రైళ్లను రైల్వేశాఖ రద్దు చేయడంతో విశాఖ-రాయపూర్ పాసింజర్, నాగావళి ఎక్స్ప్రెస్ రైళ్లకు రద్దీ పెరిగింది. సంక్రాంతి పండుగకు వలస వెళ్లే కార్మికులు, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తున్న వారంతా తిరుగు ప్రయాణం ప్రారంభించడంతో రైల్వే స్టేషన్, ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రయాణికులతో కిటకిటలాడింది. నాగావళి, రాయపూర్-విశాఖ పాసింజర్ రైళ్లకు వెళ్లేందుకు వేలాది సంఖ్యలో ప్రయాణికులు చేరుకున్నారు. బొబ్బిలి వచ్చే సరికి రైళ్లు కిక్కిరిసి ఉండడంతో రైళ్లు ఎక్కేందుకు నానా అవస్థలు పడ్డారు. లగేజీ, చిన్నపిల్లలతో రైలు ఎక్కేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైలు ఎక్కలేక కొంతమంది ప్రయాణికులు వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెరుగుతున్న రద్దీకు అనుగుణంగా రైళ్ల సంఖ్యను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

రైలు కోసం ప్లాట్‌ఫారమ్ వద్ద వేచి చూస్తున్న ప్రయాణికులు

స్థానిక గిరిజనులకే టికెట్ కేటాయించాలి

ప్రజాశక్తి -భామిని

రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ఎస్‌టి పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాల్లో స్థానిక, అసలైన గిరిజనులకే టిక్కెట్లు కేటాయించాలని గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిడ్డిక తేజేశ్వరావు డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 330, 332 ప్రాప్తికి చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పిస్తుందని, నిజమైన గిరిజనులకు రాజకీయ సాధికారత, సామాజిక న్యాయం జరగాలంటే స్థానిక నిజమైన గిరిజనులకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో స్థానికేతరులకు, నకిలీ గిరిజనులకు టిక్కెట్లు కేటాయిస్తే ఓడిస్తామని అన్నారు. తప్పుడు ఎస్‌టి కులధ్రువపత్రాలతో నిజమైన గిరిజనుల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారన్నారు. తప్పుడు ఎస్‌టి కులధ్రువపత్రాలపై డిఎల్ఎస్‌సి, త్వరిత గతిన విచారణ చేపడితే నిజమైన గిరిజనుల హక్కులు పరిరక్షింపబడతాయని తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్‌ను పక్కదారి పట్టించడం రాజకీయ పార్టీలకు పరిపాటిగా మారిందని విమర్శించారు. గిరిజన ప్రాంతాల్లో పటిష్ఠమైన 1/70, పీసా, జిఒ 3, అటవీ హక్కుల చట్టాలు అమలు చేయడంపై ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయని అన్నారు. ఈ మేరకు ఈనెల 27న అరకు పార్లమెంట్ కేంద్రంలో గిరిజన జెఎసి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మేధోమథన సదస్సుకు మేధావులు, విద్యార్థి యువజన విభాగాలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో గిరిజన ఐక్య వేదిక జిల్లా జాయింట్ కార్యదర్శి పిరపాక శ్రీనివాసరావు, రాష్ట్రసభ్యులు నిమ్మల మోహనరావు, ఊయక సింహాచలం, కీర్తిరాయి సుగ్రీవులు, కద్రక లక్ష్మీనారాయణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు నోటీసులు

ప్రజాశక్తి - వీరఘట్టం

అంగన్‌వాడీ కార్యకర్తలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ 41 రోజుల నుంచి నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 22న చలో విజయవాడ తలపెట్టిన నేపథ్యంలో ఆదివారం వీరఘట్టం పోలీసులు ఈ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు వారికి నోటీసులు అందజేశారు. అయితే అంగన్‌వాడీ కార్యకర్తలు తాము సమ్మెలో ఉన్నాం కనుక నోటీసులు తీసుకోమని స్పష్టం చేశారు. దీంతో పోలీసులు అంగన్‌వాడీ కేంద్రాలకు నోటీసులు అంటించి వెళ్లారు.

101 మందికి నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టపూడివలస జంక్షన్ వద్ద గల శ్రీ సత్య సాయి నిత్య అన్నపూర్ణ సేవా సంస్థ సౌజన్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేత్ర వైద్య శిబిరంలో నేత్ర వైద్యాధికారి కె.అలేఖ్య 101 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 62 మందిని ఎంపిక చేసి శస్త్ర చికిత్సల కొరకు విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్చార్జి సిహెచ్ వెంకటరమణ, శ్రీ సత్యసాయి నిత్య అన్నపూర్ణ సేవా సంస్థ నిర్వాహకులు సీతంనాయుడు, వెంకటరమణ, కంటి రోగులు పాల్గొన్నారు.

ఎస్ఇబి సిఐగా జోగమ్మ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఇబి) సిఐగా డిసిహెచ్ జోగమ్మ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె అనకాపల్లి జిల్లా చోడవరం ఎస్ఇబి సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ కురుపాం బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన సర్కిల్ పరిధిలో గల నాటు సారా, అక్రమ మద్యం తరలించిన, అమ్మకాలు చేపట్టిన వారిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తూ కఠిన చర్యలు తీసుకుంటూ పూర్తిగా నిర్మూలనకు కృషి చేస్తానని అన్నారు.

జోనల్ ఉత్తరాంధ్ర కో-కన్వీనర్‌గా సత్తిబాబు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఎన్నికల నిర్వహణ జోనల్ ఉత్తరాంధ్ర కోకన్వీనర్‌గా గర్భాన సత్తిబాబును జనసేన అధినేత కె.పవన్‌కల్యాణ్, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన అధ్యక్షులు పిసిని చంద్రమోహన్‌కు వీరఘట్టం మండల జనసేన నాయకులు జె.చంద్రశేఖర్, కోడి వెంకటరమణనాయుడు, ఎస్ వెంకటరమణ, వండన సాయికుమార్, జి.నరేంద్ర, పి.పురుషోత్తం, ఎన్.వినోద్‌కుమార్, ఆర్.గోవిందరావు తదితరులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

గాయపడ్డ యువకుడు మృతి

ప్రజాశక్తి - పాచిపెంట

పాచిపెంటకు చెందిన బవిరెడ్డి పవన్‌కుమార్ (25) అదుపు తప్పి చెట్టుకు ఢీకొని శనివారం గాయపడగా, అదేరోజు రాత్రి మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాచిపెంటకు చెందిన పవన్‌ఖుమార్ శనివారం సాలూరు నుంచి ద్విచక్రవాహనంపై పాచిపెంట వస్తుండగా గ్రామ సమీపాన ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు బలంగా ఢీకొనడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో 108 వాహనం ద్వారా సాలూరు సిహెచ్‌సికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడని మృతుడిని సోదరుడు గణేష్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని పిన్నింటి రామినాయుడువలసకు చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు పిన్నింటి వెంకటరమణ తల్లి మృతి చెందడంతో ఆదివారం నియోజకవర్గ టిడిపి నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులతో పాటు మాజీ మండల పార్టీ అధ్యక్షులు దొగ్గ మోహన్ రావు , కోలా బాబు మండల, పట్టణ టిడిపి నాయకులు పరామర్శించారు.

వెంకటరమణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, నాయకులు